

## అన్ని స్కూళ్లకు ముద్దమందారం పుస్తకాలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పాఠశాల స్థాయి ఆరవ తరగతి నుంచి పదవతరగతి వరకు ఆడపిల్లలకు వారి వ్యక్తిగత ఆరోగ్య విషయాల గురించి తెలుసుకునేందుకు ముద్దమందారం పేరుతో ముద్రించిన పుస్తకాలను జిల్లాలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని జిల్లా జిసిడిఒ దార్ల రూత్ ఆరోగ్య మేరి తెలిపారు. బుధవారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో విద్యార్థునులకు ముద్దమందారం పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు అవగాహన కోసం రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన ఈ పుస్తకాలు కడప సమగ్ర శిక్ష ఆఫీసుకు చేరాయని చెప్పారు. అక్కడ నుంచి జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులకు పంపిస్తున్నామని పేర్కొన్నారు. అక్కడ నుంచి అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తారని తెలిపారు. విషయాన్ని జిల్లాలోని ఉపాధ్యాయులందరూ గమనించి ఎంతో ఉపయోగకరమైన పుస్తకాలను ప్రతి ఒక్క ఆడపిల్లకు చేరే విధంగా బాధ్యతగా పనిచేయాలని చెప్పారు.

## వ్య.కా.స జాతీయ సమావేశాలు విజయవంతం

- మూడ్రోజులపాటు సుదీర్ఘంగా సాగిన మేధోమథనం
- సంఘం బలోపేతానికి దిశానిర్దేశం
- కేరళ ఎంపీ వి.శివదాసన్ సహా జాతీయ కార్యవర్గం హాజరు
- జిల్లా కేడర్‌లో పెరిగిన జోష్

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు బుధవారం సాయంత్రంతో జయప్రదంగా ముగిశాయి. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో నగరంలోని హరితా హోటల్‌లో మూడ్రోజులపాటు నిర్వహించిన జాతీయ కౌన్సిల్ సమావేశాలకు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్‌తో కలిసి కేరళ ఎంపీ వి.శివధాసన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వ్య.కా.స రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు వంటి ప్రముఖుల పర్యవేక్షణలో ఉత్సాహపూరిత వాతావరణంలో జాతీయ సమావేశాలను నిర్వహించారు. తొలిరోజు కడప కోటిరెడ్డిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండ్ సర్కిల్‌లోని జ్యోతిబాపూలే సర్కిల్ మీదుగా విప్లవ గీతాలు, జానపద గీతాలాపన చెక్కభజన, ప్రజానాట్య మండలి కళాకారుల విభిన్న నృత్య రీతులతో బహిరంగ సభ వేదిక వరకు సాగిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్, కేరళ ఎంపీ వి.శివధావన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు ప్రసంగాలు సబికులను ఆలోచనలో పడేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల్లోని లోపాలను తూర్పార బట్టడం ప్రజలను ఆకట్టుకుంది. రెండవ రోజు వ్యవసాయ కార్మిక సంఘం జెండాను వ్య.కా.స జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్ ఆవిష్కరించారు. అనంతరం అమరుల స్థూపానికి నివాళులర్పించారు. తర్వాత




ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న వ్య.కా.స జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

సెమినార్ హాలులో సిపిఎం అగ్రనేతలైన పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి, కేరళ మాజీ ముఖ్యమంత్రి సదాశివన్ చిత్రపటాలకు పూలమాలలు వేసిన అనంతరం దేశంలో ఇటీవల మృతి చెందిన ప్రజాసంఘాల నాయకులను స్మరించుకుని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్ దేశంలోని వర్తమాన రాజకీయాలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ, రాష్ట్ర మహిళా కన్వీనర్లు చర్చా గోష్ఠి నిర్వహించారు. అనంతరం వ్య.కా.స జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం 22 రాష్ట్రాల నుంచి వచ్చిన 200 మంది ప్రతినిధులు ఆయా రాష్ట్రాలో చేసిన పోరాటాల్లో ఎదురైన అనుభవాలను సమీక్షించుకుని సంఘం కార్యకలాపాలను పెంచడానికి సంబంధించిన భవిష్యత్ జెండాకు రూపకల్పన చేశారు. మూడవ రోజైన బుధవారం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘ సమావేశాలను అంచనాలకు మించి జయప్రదం చేసిన జిల్లా కమిటీ సభ్యులను జాతీయ నాయకులు అభినందించారు. జాతీయ నాయకులను జిల్లా నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. జాతీయ సమావేశాలను ముగించిన అనంతరం ప్రతినిధులు తమ రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఊపిరిపీల్చుకుంది. సమావేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, బి.మనోహర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మోహన్, దస్తగిరిరెడ్డి, ఎన్.చంద్రారెడ్డి, ఎన్.శివకుమార్, ఎస్.రవి, వీరనాల శివకుమార్, సత్యం, ఆర్.రాహుల్, లక్ష్మీరాజా, పి.మహేష్, జకరయ్య, సునీల్, సుబ్బయ్య, మహిళా నాయకులు లక్ష్మీదేవి, జమీలా పాల్గొన్నారు.

## బతుకుదెరువు కోసం వచ్చి మృత్యుఒడిలోకి..

- లారీ బీభత్సం.. ఇద్దరు గొర్రెల కాపరులు దుర్మరణం
- 15 గొర్రెలు మృత్యువాత
- మృతులు నంద్యాల జిల్లా వాసులు
- శోకసంద్రంలో రెండు కుటుంబాలు



మృతి చెందిన గొర్రెల కాపరులు వెంకటేష్, లక్ష్మీనరసింహులు

**ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్**

నంద్యాల జిల్లాకు చెందిన రెండు కుటుంబాలు బతుకుదెరువు కోసం వచ్చిన గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో మృత్యు వాతపడ్డారు. జమ్మలమడుగు-తాడిపత్రి బైపాస్ రోడ్డులో బుధవారం తెల్లవారు జామున లారీ బీభత్సం సృష్టించింది. కూలీ కోసం వచ్చిన ఇద్దరు గొర్రెల కాపరులు దుర్మరణం చెందడంతో పాటు 15 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. వివరాలలోకి వెళితే... నంద్యాల జిల్లా రుద్రవరం మండలం నల్లాపల్లెకు చెందిన కృష్ణయ్యకు రెండు వందల వరకు గొర్రెలు ఉన్నాయి. గత నెల నుండి జమ్మలమడుగు మండల పరిధిలోని గండికోట ఆంజనేయ స్వామి వద్ద గొర్రెల స్థావరాన్ని ఏర్పాటు చేసుకొని గొర్రెలు మేపుకుంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గండికోట నుంచి జమ్మలమడుగు, జమ్మలమడుగు-తాడిపత్రి బైపాస్ మీదుగా గొర్రెలను తీసుకొని కూలీలు తిరుగు ప్రయాణమయ్యారు. బైపాస్ వద్దకు రాగానే గుర్తుతెలియని లారీ గొర్రెలను, కాపరులను ఢీకొట్టి వెళ్ళిపోయింది. ఈ



రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతి చెందిన గొర్రెలు

ప్రమాదంలో గొర్రెలు 15 చనిపోయాయి, ఇద్దరు గొర్రెల కాపరుల కాళ్లపై లారీ వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గొర్రెల కాపరి వరద వెంకటేశ్(50) అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు కాపరి రాజుపాలెం లక్ష్మీ నరసింహులు(35)ను చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు కర్నూల్‌కు రెఫర్ చేశారు. నంద్యాల సమీపంలో ఆయన కూడా మృతి చెందారు. అక్కడి నుంచి తిరిగి జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. లక్ష్మి నరసింహులుకు భార్య హరికుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వరద వెంకటేసుకు భార్య నాగమ్మ ఉన్నారు. మృతుల బంధువుల ఆర్తనాథాలతో ఆస్పత్రి, పోలీసుస్టేషన్ మిన్నంటాయి. తమ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

## సమస్యలకు చావు పరిష్కారం కాదు

**- సైకాలజిస్ట్ వెంకటేశ్వరరెడ్డి**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

చావు సమస్యలకు పరిష్కారం కాదని ప్రముఖ సైకాలజిస్ట్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం స్థానిక కోటిరెడ్డి మహిళా కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, ఇంటాక్ కడప చాప్టర్, మన నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలకు భయపడి చావాలనుకునుకోవడం పరిష్కారం కాదని పేర్కొన్నారు. ముందుగా సమస్య వచ్చినప్పుడు ఇతరులతో పంచుకోవాలి, ఆ సమస్యకు ఇప్పటివరకు ఏమైనా పరిష్కారాలు ఉన్నాయేమో తెలుసుకోవాలని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు, ప్రముఖ యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా ఆధ్యాత్మికంగా బలహీనపరిచే ఏ ఒక్క అంశాన్ని మనందరికి చేరనీయవద్దని ఆత్మహత్యల నివారణలో మనమందరం భాగస్వాములు కావాలని అన్నారు. బలమైన ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని భవిష్యత్తు మీద ఆశ పెంచుకున్నట్లయితే ఆత్మహత్యలకు మన దూరంగా ఉండవచ్చని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేమన సలీం బాషా పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎం గురు మోహన్ రెడ్డి, మహిళా సాధికార విభాగం కన్వీనర్ నాగరత్నమ్మ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏరియా మేనేజరు శివశంకర్ రెడ్డి, శ్రీ రామయ్య చిట్స్ మేనేజరు బాజీ, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినులు పాల్గొన్నారు.

**ఆత్మహత్య అత్యంత కఠినమైన నిర్ణయం**

**కడప సిటీ :** పపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా ఆత్మహత్య అత్యంత కఠినమైన నిర్ణయం అని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్




ర్యాలీలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, వైద్యులు

సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రాముడు అన్నారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం స్థానిక రిమ్స్ ఐఎంహెచ్ నుంచి జిజిహెచ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఐఎంహెచ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలకు భయపడి చావాలనుకునుకోవడం పరిష్కారం కాదని పేర్కొన్నారు. ప్రతి సమస్య ఎదగడానికి అదొక మార్గం వంటిదని గమనించాలని తెలిపారు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జమున, మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలని, సమస్యలు వస్తే కుంగిపోకుండా ధైర్యంగా ఎదురుకోవాలని తెలిపారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరిండెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జన్మించిన ప్రతి వ్యక్తికి పూర్తిగా జీవించే హక్కు ఉందన్నారు. చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల కుటుంబం చిన్నాభిన్నమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ సూపరిండెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, ఐఎంహెచ్ డాక్టర్లు హౌస్ సర్జన్స్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

- బ్రిడ్జి డివైడర్ ఢీకొన్న స్కూల్ బస్సు
- విద్యార్థులకు స్వల్ప గాయాలు
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు

**ప్రజాశక్తి-వల్లూరు**

మండలంలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. పిల్లలతో వెళ్తున్న స్కూల్ బస్సు డివైడర్ ఢీకొన్న సంఘటనలో 15 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించిందని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికుల వివరాల మేరకు.. వల్లూరులోని విజ్ఞాన్ పాఠశాలకు చెందిన బస్సు బుధవారం సాయంత్రం విద్యార్థులతో పాఠశాల నుంచి బయలు దేరింది. బస్సులో తప్పెట్ల, చిన్న లేబాక, పుల్లారెడ్డిపేట గ్రామాలకు చెందిన విద్యార్థులు తమ ఇళ్లకు బయలు దేరారు.



ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

బస్సులో మొత్తం 45 మంది విద్యార్థులున్నారు. మండలంలోని తప్పెట్ల గ్రామీ సమీపంలో ఉన్న రైల్వేబ్రిడ్జి వద్ద రాగానే బస్సు డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో 15 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మిగిలిన వారు క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడడంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు పేర్కొంటున్నారు. బస్సు డివైడర్‌ను ఢీకొట్టకుండా ఉంటే అమాంతం కింద ఉన్న రైల్వే ట్రాక్‌పై పడినా లేక హైవోల్టేజీ తీగల పడినా పెను ప్రమాదమే సంభవించి ఉండేది. ప్రమాదంపై పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. సంఘటనపై



స్కూల్ బస్సును జెసిబి సాయంతో వెలికి తీస్తున్న స్థానికులు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వల్లూరు ఎస్ఐ పెద్ద ఒబన్న పేర్కొన్నారు.

**నిబంధనలు పాటించని స్కూల్ యాజమాన్యం**


కొన్ని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం నిబంధనలు పాటించకపోవడం, బస్సు ఫిట్‌నెస్‌లో నిర్లక్ష్యం వహించడంతోనే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. డ్రైవర్లను నియమించుకునే సమయంలో వారి అలవాట్లను కూడా పరిగణంలోకి తీసుకోవాల్సి ఉంది. పోలీసు అధికారులు తమ పరిధిలో ఉన్న ప్రయివేట్ విద్యాసంస్థల యాజమానులను, డ్రైవర్లను కౌన్సిలింగ్ ఇప్పించి భవిష్యత్తులో ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## అక్రమాలను అరికట్టాలి : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి -కడప అర్బన్ :** రాయలసీమ ఆర్‌సిఎం డయాసిస్ ఎయిడెడ్ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో జిల్లా వ్యాప్తంగా అవకతవకలకు పాల్పడినటువంటి ఆర్‌సిఎం యాజమాన్యంపై, వాటికి సహకరించే విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్ తెలిపారు. బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయంలో ఏడి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఆర్‌సిఎం డయాసిస్ ఎయిడెడ్ స్కూల్లో పోస్టుల భర్తీలో అనేక అవకతవకలు ఉన్నాయని చెప్పారు. ఉద్యోగం ఒకచోట సంపాదించి మరోచోట ఉద్యోగం చేస్తున్నారని, ఇది విద్యాశాఖ అధికారుల సహకారంతోనే కొనసాగుతూ ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు లేరని మూతపడినటువంటి స్కూళ్లలో మళ్లీ అదే స్కూల్లో పేరుతో ఉద్యోగం సంపాదించి వేరేచోట ఉద్యోగం చేయడం నిదర్శనమన్నారు. ఇంత స్థాయిలో అవకతవకలు జరిగినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. విద్యా శాఖలో కొంతమందికి ముడుపులు అందాయి కాబట్టి వీరి పోస్టుల భర్తీలో సహకారం అందించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్‌తో మాట్లాడి అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి ఉద్యోగం అక్రమ మార్గం సంపాదించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహ, జిల్లా నాయకులు సునీల్ పాల్గొన్నారు.

### హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా జయప్రసాద్ రాజు

**ప్రజాశక్తి -కడప సిటీ**



ఎన్నికైన నూతన కార్యవర్గం

హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా కడప ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహం హెచ్‌డబ్ల్యూఒ జయప్రద రాజు ఎన్నిక య్యారు. బుధవారం మాజీ అధ్యక్షులు రామ లింగేశ్వరరెడ్డి అధ్యక్షతన ఎన్నికల నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం మూడేళ్ల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో కడప ప్రభుత్వ బిసి సమీకృత బాలుర వసతి గృహంలో నూతన సంక్షేమ అధికారుల ఎన్నికలు రామలింగేశ్వరరెడ్డి అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. జిల్లా బిసి సంక్షేమశాఖ వసతి గృహ అధికారుల సంఘం(హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్) అధ్యక్షులుగా కడప ప్రభుత్వ బి సి బాలుర వసతి గృహం హెచ్‌డబ్ల్యూఒ జయప్రసాదరాజు, గౌరవ అధ్యక్షులుగా రాజబాబు , జనరల్ సెక్రటరీగా శ్రీనివాసులు , వైస్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్, కోశాధికారిగా రాజు నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఎన్నికైన నాయకులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎపిఎన్‌జిఒ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

**- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసులు, నిత్యపూజయ్య**

**ప్రజాశక్తి - కడప అర్బన్**



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

ఎపి ఎన్‌జిఒ కడప జిల్లా ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. బుధవారం ఎన్‌జిఒ హోమ్‌లో జిల్లా ఎన్నికల నామి నేషన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్ ఆదేశాల మేరకు కడప జిల్లా ఎన్నికల అధికారిగా నెల్లూరు అధ్యక్షులు ఎం.పెంచలరావు, సహాయ ఎన్నికల అధికారిగా జి.రామకృష్ణ, ఎన్నికల పరిశీలకులు గా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నామినేషన్ స్వీకరించారు. జిల్లా ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అధ్యక్షులు, కార్యదర్శి తో పాటు మొత్తం 17 పోస్టులకు గాను 17 మందే నామినేషన్ వేయడంతో అందరూ ఏకగ్రీవంగా ఎన్నికైయినట్లు ఎన్నికల అధికారి ఎం.పెంచలరావు ప్రకటించారు. కడప జిల్లా అధ్యక్షులుగా బి.శ్రీనివాసులు, సహ అధ్యక్షులగా టి.తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎ.నరేంద్ర, ఎం.బాలపులయ్య, సి.దస్తగిరి, పోలిరెడ్డి, సి.సిద్దయ్య, ఎం. లక్ష్మీదేవి ( ఉమెన్), జిల్లా కార్యదర్శి పి.నిత్య పూజయ్య, ఆర్గనైసింగ్ కార్యదర్శి యం.బ్రహ్మన%శీ%ద రెడ్డి, జాయింట్ సెక్రటరీలు ఎస్.నరసింహ రెడ్డి, ఎన్.రాజ శేఖర్, డి.పద్మనాభరావు, ఇ.ఇరామియ్య, జి. శ్రీనివాసులు కె.సుహాసిని, కుమారి(ఉమెన్), కోశాధికారి టి. శ్రీనివాసులు ఎన్నికయ్యారు. పై కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. బి.శ్రీ నివాసులు మాటాడుతూ మరో సారి కడప జిల్లా అధ్యక్షులుగా తాను ఎన్నిక కావడానికి రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యా సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరికి అందుబాటులో ఉంటూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

### పోలీస్ శాఖకు నూతన జాగిలం 'సోను'

**ప్రజాశక్తి - కడప అర్బన్**



జాగిలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

కేసుల చేధనలో, నేరస్థులను గుర్తించడంలో జిల్లా పోలీస్ శాఖ మరింత బలోపేతం అయ్యేందుకు నూతన జాగిలం 'సోను' జిల్లా పోలీస్ శాఖకు వచ్చిందని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ తెలిపారు. బెల్జియం మల నాయిస్ జాతికి చెందిన నూతన జాగిలం మంగళగిరి హెడ్ హెడ్ క్వార్టర్స్ 6వ బెటాలియన్ లో 10 నెలల పాటు శిక్షణ పొందిందన్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన జాగిలం 'సోను'ను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## సహకరించకపోవడం దారుణం

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ పీర్**

**ప్రజాశక్తి- కడప అర్బన్**



సమస్యలు వింటున్న గౌస్‌పీర్

ఉప రాష్ట్రపతి పదవికి పోటీలో ఉన్న తెలుగు వ్యక్తికి తెలుగు రాష్ట్ర పార్టీలు సహకరించకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ విమర్శించారు. బుధవారం నగరంలో 2వ డివిజన్‌లో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. అక్కడి ప్రజల సమస్యలను, వీధి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కార దిశగా ముందుకు వెళుతున్నామన్నారు. ఎక్కడ చూసినా సమస్యలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. సమస్యల పరిష్కార దిశగా తాను, డివిజన్ ఇన్‌ఛార్జి యూసుఫ్, కార్యకర్తలు కలిసి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా ఎన్‌డిఎ కూటమి తోక పార్టీలు బిజెపికి వ్యతిరేకమని పైకి ఆర్భాటాలు పలుకుతూ లోపల మాత్రం సానుకూలంగా పని చేశారన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థికి సహకరించలేదని చెప్పారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, ఇతర డివిజన్ల ఇన్‌ఛార్జులు షామీర్ హుస్సేన్, ఫజలుల్లా, మస్రత్ అలీ ఖాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**ప్రజాశక్తి - బద్వేలు :** ప్రయివేట్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లకు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని డాక్టర్ వి. మల్లేష్ పేర్కొన్నారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి డెంటల్, కృష్ణ డెంటల్ ఆస్పత్రులను ఆయన సందర్శించారు. స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్, డాక్టర్ల క్వాలిఫికేషన్, పారా మెడికల్ స్టాఫ్ క్వాలిఫికేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. మల్లేష్ మాట్లాడుతూ ప్రతి ప్రయివేట్ ఆస్పత్రి కచ్చితంగా రిజిస్టర్ చేసుకొని ప్రజలకు మంచి సేవలను అందించాలని, చట్టపరంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బద్వేల్ పట్టణంలో ఉన్నటువంటి ప్రతి నర్సింగ్ హోమ్ క్లినిక్స్ పరిశుభ్రతతో పాటు బయోమెడికల్ వేస్టేజ్ మేనేజ్మెంట్ పాటిస్తూ ఫైర్ ఎన్ఒసి అన్ని రికార్డ్స్ రిపోర్ట్స్ సక్రమంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.వెంగయ్య, డెంటల్ హాస్పిటల్ డాక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### హోమ్‌గార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


**ప్రజాశక్తి - కడప అర్బన్ :** జిల్లా పోలీస్ కార్యాలయంలో హోమ్ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన ఎస్.రఘువర్మ(హెచ్ జి 486) కుటుంబానికి ఎస్‌పి రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. హోమ్‌గార్డు రఘువర్మ సతీమణి కె.విజయమేరికి ఎస్‌పి పోలీస్ వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని అందజేశారు. హోమ్‌గార్డు కుటుంబ యోగక్షేమాలు విచారించారు.

## జ్ఞానపీఠాన్ని అధిరోహించిన కవిసామ్రాట్

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** రామాయణ కల్పవృక్షం వంటి గొప్ప కావ్యాన్ని అందించి జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న కవిసామ్రాట్ 'విశ్వనాథ సత్యనారాయణ' అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బుధవారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో విశ్వనాథ సత్యనారాయణ 130వ జయంతిని నిర్వహించింది. ముందుగా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి విశ్వనాథ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యవిభాగంలో అత్యుత్తమ పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డును మొదటిసారి అందుకుని తరువాత తరం వారికి మార్గదర్శకు డయ్యారన్నారు. పేదరికంలో పుట్టి, చెళ్లపిల్ల వెంకటశాస్త్రి దగ్గర శిష్యరికం చేసి కష్టపడి చదువుకుని జ్ఞానాన్ని సంపాదించారన్నారు. పద్యం, విమర్శ, నాటకం, కథ, కవిత లాంటి పలు ప్రక్రియల్లో సుమారు 50కి పైగా రచనలు చేసిన గొప్పకవి విశ్వనాథ అని అన్నారు. అందరూ చెప్పిన రామాయణాన్నే మళ్లీ నువ్వు కొత్తగా చెప్పేదేముంది అని అపహాస్యం చేసినా, తనదైన శైలిలో రామాయణ కల్పవృక్షం రాసి తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, దక్షిణా మూర్తి, సాయి బాలాజీ, ఎం.పద్మావతి, భాస్కర్, శ్రీహరి యాదవ్ పాల్గొన్నారు.

### పార్టీని అభివృద్ధి చేయడమే లక్ష్యం

**ప్రజాశక్తి-కాశినాయన**



మాట్లాడుతున్న రవీంద్రరెడ్డి

మండలంలో టిడిపిని అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జి బసిరెడ్డి రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. బుధవారం అయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలుస్తామని చెప్పారు. మండలంలోని ఏ పంచాయతీలో అయినా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని చెప్పారు. ప్రతి గ్రామాన్ని, ప్రతి పంచాయతీని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ టిడిపి ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తానన్నారు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ అన్ని పథకాలు అమలు చేశామని చెప్పారు. ప్రతి సంక్షేమ పథకం ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట చెప్పిన విధంగా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వచ్చి రాగానే మండలంలోని 17 పంచాయతీలలో ఎక్కడైతే సిసి రోడ్లు లేవో అవన్నీ మంజూరు చేయించి విజయమ్మ ఆధ్వర్యంలో వేయించారని గుర్తు చేశారు. త్వరలో మిగిలిన రోడ్లను పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. మండలంలో ఎక్కడ అభివృద్ధి కుంటుపడిందో అక్కడ అభివృద్ధి చేసేందుకు విజయమ్మ ఆధ్వర్యంలో తాము సిద్ధంగా ఉన్నామన్నారు




## యూరియా కొరతతో రైతుల్లో ఆందోళన

**ప్రజాశక్తి - మైదుకూరు రూరల్**

మండలంలో యూరియా కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఖరీఫ్ సీజన్ మొదలవ్వడంతో పంటలకు యూరియా అత్యవసరం కాగా.. మైదుకూరు రైతు సేవా సహకార పరపతి సంఘంలో నిల్వలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మైదుకూరు సొసైటీలో యూరియా ఎరువులు లభించకపోవడంతో రైతులు నిత్యం సొసైటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సాగులో ఉన్న పంటలకు సమయానికి యూరియా వేయకపోతే దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఇతర సహకార సంఘాలకు అధికారులు ఎరువులను కేటాయించారని, మైదుకూరుకు మాత్రం నిల్వలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీనిపై మైదుకూరు సహకార పరపతి సంఘం అధికారులు మాట్లాడుతూ యూరియా ఎరువుల కొరత ఉన్న మాట వాస్తవమే. తాము ఇప్పటికే జిల్లా అధికారులకు ఇండెంట్ (డిమాండ్ లెటర్) పంపాం. మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని సొసైటీలకు ఎరువులు కేటాయించాలని కోరామన్నారు. సమస్యపై త్వరగా స్పందించి ఎరువులు సరఫరా చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సూపర్‌హిట్ సభ హాస్యాస్పదం : పిసిసి

**ప్రజాశక్తి - వేంపల్లె**

సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ అంటూ టిడిపి, కూటమి పార్టీలు అనంతపురంలో బహిరంగసభ నిర్వహించడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేందుకు సూపర్‌సిక్స్ హామీలు ప్రధాన కారణమన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినప్పటికీ సూపర్‌సిక్స్ హామీల్లో ప్రధానమైన హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. నిరుద్యోగభృతి, ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఆర్థికసాయం అమలుకు నోచుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఇవ్వలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి నిధి ఇవ్వలేదని విమర్శించారు. తల్లికి వందనం పథకం కింద పూర్తిగా ఒక విద్యా సంవత్సరానికి ఇవ్వలేదన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వైసిపి ఎంపిలు బిజెపి బలపరిచిన రాధాకృష్ణన్‌కు ఓటు వేయాలని చెప్పారన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు.

## ఎట్టకేలకు దిగివచ్చిన మున్సిపల్ కమిషనర్

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఎట్టకేలకు దిగివచ్చి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని కొనసాగించారు. తొలుత ప్రకటించిన విధంగా మంగళవారం జరగాల్సిన మున్సిపల్ సమావేశం రసాభాసగా సాగడంతో నిలిచిపోయింది. ఎక్స్ అఫిషియో సభ్యులు, ఎమ్మెల్యే వరద రాజులరెడ్డితోపాటు కమిషనర్ సమావేశం భవనం బయటికి వెళ్లిపోవడంతో.. సభ జరగకుండా కమిషనర్ బయటికి వెళ్లడమేంటని కౌన్సిల్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. కమిషనర్, కౌన్సిల్ సమావేశానికి వచ్చి సభను జరపాలని కౌన్సిల్ సభ్యులు మంగళవారం సాయంత్రం నుంచి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం వరకు నిరసన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు కమిషనర్ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రావడంతో చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రజల వినోదం కోసం ప్రతి సంవత్సరం జరిపే దసరా ఎగ్జిబిషన్ టెండర్ ఆమమోదంతోపాటు ఇతర అంశాలను పాలకమండలి ఆమోదం తెలిపింది.

## విద్యార్థినులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

**ప్రజాశక్తి - వేంపల్లె**



వేంపల్లె ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల 310మంది విద్యార్థినులకు బుధవారం ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. దాతల సహకారం మరవలేమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు బైరెడ్డి వెంకట సునీల్‌కుమార్, గౌరవాధ్యక్షుడు పుల్లగూర గోవర్ధన్, ఉపాధ్యక్షుడు ద్వారకానాథ్, కార్యదర్శి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షుడు శివకిరణ్, కార్యవర్గ సభ్యులు పుల్లగూర అరవింద్, గౌతమ్‌కుమార్, జూటూరు పెద్ద రెడ్డయ్య పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్లపర్తి సర్కిల్)**

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఎస్ఆర్‌జిఇ చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఆర్‌జిఇ కళాశాలలో బుధవారం బి2025బీ భాగంగా ఫ్రెషర్స్ డే, ఓరియంటేషన్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాండు రంగన్ రవి తెలిపారు. గౌరవ అతిథులుగా ఎర్రగుంట్ల సిఐ ఎస్.విశ్వనాథరెడ్డి, ప్రొద్దుటూరు రూరల్ సిఐ ఎం. నాగభూషణం, చింతకొమ్మదిన్నె సిఐ బి.బాల మద్దిలేటి, ప్రఖ్యాత మోటివేటర్ చైర్మన్ ఆఫ్ బిపిఓ కర్నూలు బ్రాంచ్ వి.చంద్రశేఖర్ రాజు, హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి మాట్లాడుతూ బీటెక్, ఎంబీఏ, డిప్లమా, లాటరల్ ఎంట్రీ 2025-26 సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆహ్వానం పలికి, రేపటి మీ ఆశయ సాధనకు మీ ఉజ్వల భవిష్యత్తుకు మా ఎస్ఆర్‌జిఇ కళాశాల యజమాన్యం, ప్రిన్సిపల్ నేను, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు నిరంతరం పాటు పడతామన్నారు. కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ మీ అందరి ప్రవేశాల ద్వారా కళాశాల దినదినాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. సామాజిక దృక్పథం ఉండాలని సూచించారు. మోటివేటర్ చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ నాలెడ్జ్, స్కిల్స్, క్రియేటివిటీ అలవరచుకొని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సీనియర్ విద్యార్థులు తమ జూనియర్లకు ఆహ్వానం పలికారు. నృత్యాలు, పాటలతో సందడి చేశారు. వైస్ ప్రెసిడెంట్ బి వీరకుమార్‌రెడ్డి విద్యార్థులకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు, కళాశాల యాజమాన్యం

## జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

ఈ నెల 29న పులివెందుల విజయ గార్డెన్స్‌లో జరగబోయే సోకే రాధ, సోకే వెంకటరమణ కుమారుడు సోకే వంశీ, తలుపుల శశికళ వివాహ వేడుకలకు హాజరుకావాలని బుధవారం తాడేపల్లిలో మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నివాసంలో ఆహ్వానించారు. ఆ మేరకు వివాహ పత్రికను జగన్‌కు అందజేశారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, పార్టీ నాయకులు కనక పాల్గొన్నారు.


జగన్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రమణ

# గ్రామాలను వణికిస్తున్న విషజ్వరాలు

### జ్వరాలు, వాంతులతో అల్లాడుతున్న ప్రజలు - ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయని అధికారులు

**ప్రజాశక్తి - చాపాడు**


జ్వరబాధితులతో కిటకిటలాడుతున్న మైదుకూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రి

చాపాడు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు జ్వరాలకు వణికిపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు విష జ్వరాలు సోకి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఎక్కువగా వైరల్ జ్వరాలు వస్తుండడంతో చిన్న పిల్లలకు మూడు నుంచి నాలుగు రోజులపాటు వైద్యం చేయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. గత నెలలో వరుసగా వారం రోజులపాటు వర్షం పడడంతో వాతా వరణంలో వచ్చిన మార్పులతో జలుబు, దగ్గు, జ్వరాలు అధిక మయ్యాయి. ఎక్కడ చూసినా జ్వరపీడితులు కనిపి స్తున్నారు. మైదు కూరులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో గత వారం రోజుల నుండి ప్రతిరోజూ 300 మంది జ్వర బాధి తులు వైద్యం కోసం వస్తున్నారని తెలుస్తోంది. వీరిలో ముఖ్యంగా 200 వరకు పది సంవత్సరాల లోపు పిల్లలు ఉన్నట్లు సమా చారం. ప్రయివేట్ ఆసుపత్రులు, గ్రామాల లోని ఆర్ఎంపిల వద్ద జ్వర బాధితులు బారులుదీరు తున్నారు. జ్వరాలు, వాంతులతో ప్రజలు ఇబ్బం దులు పడుతుంటే ప్రభుత్వ వైద్య సిబ్బంది గ్రామాల్లో ఎలాంటి సర్వేలు నిర్వహించడం లేదు. కొన్ని గ్రామాలలో 30 నుంచి 40 మంది ప్రజలు జ్వరంతో బాధపడుతున్నా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. సిద్ధారెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో చదివే 12 మంది విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నారు. అల్లాడుపల్లె ఎస్సీ కాలనీలో, ఖాదరపల్లె గ్రామంలో చిన్న పిల్లలు ఎక్కువ మంది జ్వరం, విరేచనాలతో ఇబ్బందులు పడుతూ ప్రొద్దుటూరులోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజులపాటు వైద్యం కోసం ఉన్న తన కుమారునికి రూ.12,000 బిల్లు చెల్లించాల్సి వచ్చిందని బాధితుని తండ్రి ఖాదర్‌పల్లె సుబ్బరాయుడు వాపోయారు. ఈ విధంగా చాలామంది జ్వరాలు, విరేచనాలతో వేలాది రూపాయలు వెచ్చిస్తూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం చర్యలు చేపట్టి వైద్య ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# యూరియా అందుబాటులో ఉంచుతాం : జెడిఎ


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి చంద్రా నాయక్

**ప్రజాశక్తి - చాపాడు**

రైతులకు అవసరమైన యూరియాను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతున్నామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్ర నాయక్ తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె, కేతవరం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లాడుపల్లె గ్రామ సభలో జెడి మాట్లాడుతూ రైతులు యూరియాను అవసరం మేరకు వినియోగించాలన్నారు. యూరియా అధికంగా వాడడం వలన అన్ని విధాలా హానికరమన్నారు. వరి పంట కాలానికి మొత్తం ఎకరాకి 70కిలోలకు మించి యూరియాను వాడరాదన్నారు. ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడితే ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. యూరియా సరిపడా అందుబాటులో ఉందని రైతులందరికీ కూడా అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సకాలంలో యూరియాను అందించాలని రైతులు కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన మండలానికి 850 మెట్రిక్ టన్నులు రైతు సేవ కేంద్రాల ద్వారా, ప్రయివేట్ డీలర్ల ద్వారా పంపిణీ చేశామన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణమూర్తి, ఎఒ దేవి పద్మలత, గ్రామ వ్యవసాయ సహాయకురాలు విమత, శివలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - (పెద్దముడియం) జమ్మలమడుగు రూరల్ :** రైతులు ప్రకృతి వ్యవసాయం పద్ధతులను పాటించాలని పెద్దముడియం మండల వ్యవసాయ అధికారి జాకీర్ షరీఫ్ సూచించారు. పెద్దముడియం మండలం పాలూరు గ్రామంలో బుధవారం ఆయన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయ విధానాలు ఎలా అనుసరిస్తున్నారు.. ఎంత మేరకు అవగాహన కలిగి ఉన్నారో రైతులతో ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించి పంటలు సాగు చేస్తే ఖర్చు తగ్గుతుందన్నారు. పొలం సారవంతం అవుతుందన్నారు. రసాయనాలులేని ధాన్యం పండించవచ్చునని వివరించారు. కార్యక్రమంలో రైతుల పీఎం డిఎస్, ఏటీఎం మోడల్స్, ఏ గ్రేడ్ మోడల్స్ విజిట్ చేశారు. యూనిట్ ఇన్‌ఛార్జి గురుమూర్తి, మాడల్ మేకర్ దస్తగిరి, ఐసిఆర్‌పి వెంకటేశ్వర్లు, డిజిటల్ నరసింహులు, ఫార్మర్ సైంటిస్ట్ నాగ పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.


రైతు ప్రసాద్ పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

**మైదుకూరు రూరల్ :** మైదుకూరు మండలం నంద్యాలంపేట రైతు సేవా కేంద్రం పరిధిలోని శ్రీరామ్ నగర్, కొత్తపల్లె గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన ఉల్లి, పసుపు, వరి వంటి ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు (ఈ-క్రాప్) చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ పథకాలు పొందాలంటే పంట నమోదు తప్పనిసరి అన్నారు. ఇది ఒక ప్రామాణికంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. రైతులందరూ ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. యూరియా వాడకంపై యూరియా అవుట్ రీచ్ ప్రోగ్రామ్ గురించి వివరిస్తూ యూరియాను సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే వాడాలని ఎఒ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం. మధుసూదన్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పొలంపిలుస్తోంది కార్యాక్రమంలో అధికారులు

**వేముల :** స్థానిక సిద్ధంరెడ్డిపల్లిలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేష్ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు, వాటి ప్రయోజనాల గురించి వివరిం చారు. రాగి, కొర్ర, సామఊదా, అరిక, వరి సాగు చేసి మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంట మార్పిడి చేయడం వల్ల భూమి సారవంతం పెరుగుతుందన్నారు. విస్తరణ అధికారి సురేష్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విహెచ్‌ఎ లక్ష్మీ, ఏపీసీఎం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న ఎఒ జిపి ఓబులేస్

# లార్వా నిర్మూలనకు కృషి చేయాలి : డిఎంహెచ్ఒ


జ్వర పీడిత బాధితులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ నాగరాజు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

పరిసరాలను శుభ్రత పాటించి, లార్వా నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు సూచించారు. కోడిగాండ్లపల్లె గ్రామంలో విషజ్వరాలు విజృంభించి గ్రామ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు, జిల్లా మలేరియా అధికారి మనోరమ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. దోమకాటుకు గురై డెంగీ జ్వరాల బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన జ్వర పీడిత బాధితులతో జిల్లా అధికారులు మాటాడుతూ పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది బృందాలుగా విభజించుకొని ప్రతి ఇంటికి వెళ్లి లార్వా సర్వే చేయాలని సూచించారు. అనంతరం శెట్టివారిపల్లి గ్రామాన్ని పరిశీ లించి పక్కన పడేసిన టైర్లలో లార్వాను గుర్తించి వైద్య సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. లార్వాపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి కరిష్మాను ఆదేశించారు. వైద్య శిబిరం మరో వారం రోజులపాటు నిర్వహించాలని ఆదేశించారు. అపరిశుభ్రంగా ఉన్న నీటి నిల్వలో గంబూజియా చేపలను వదలాలని జిల్లా మలేరియా అధికారి మనోరమకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఖాజా మొహిద్దీన్, రాఘవ, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు రామారావు, జయమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, వైద్య సిబ్బంది విక్టోరియా పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న అధికారి ఉమామహేశ్వర కుమార్

## పిల్లలకు టీకాలు తప్పక వేయించాలి

**ప్రజాశక్తి - చక్రాయపేట**

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను తల్లిదండ్రులు తప్పకుండా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఒపి వార్డు, ల్యాబరేటరీ, ఫార్మసీ, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు, అపరేషన్ గదిని పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో టీకాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయాలని కోరారు. విష జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఖాజా మొద్దీన్, సిహెఒ మునిరెడ్డి, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ పృథ్వీకుమార్, సిహెచ్ఒ వేణుగోపాల్ రావు, ఎంపిహెచ్ఇఒ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సబ్ యూనిట్ అధికారి ఎంవి ప్రసాద్, హెల్త్ మేల్ అసిస్టెంట్ వెంగయ్య, లక్ష్మి దేవి, సిహెచ్ఒలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## హై రిస్క్ కేసులను గుర్తించాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న హై రిస్క్ కేసులను ఆరోగ్య సిబ్బంది గుర్తించి వారికి మెరుగైన వైద్యం అదేలా కృషి చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాజా మొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటింటికి వెళ్లి లార్వాను పరిశీలించాలని కోరారు. ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుభాషిణి, శాంతి, నిహారిక, సిహెచ్ఒ వెంకటరత్నం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఫక్రుద్దీన్, సూపర్ వైజర్ అంకయ్య, ఆరోగ్య కార్యకర్తలు, సిహెచ్ఒలు పాల్గొన్నారు.

## రైతు కూలీకి గౌడ్ సంఘం చేయూత

**ప్రజాశక్తి - వేంపల్లె**

పొలం పనులు చేస్తూ గాయపడిన వలదాసు బ్రహ్మయ్య గౌడ్‌కు గౌడ్ సంఘం నాయకులు ఆర్థికసాయం చేశారు. ఇటీవల దువ్వూరు మండలంలోని చింతకుంట బయనపల్లెకు చెందిన బ్రహ్మయ్య అనే రైతు కూలీ పొలం పనులు చేస్తుండగా ట్రిల్లర్ సేద్యం చేసే ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో బ్రహ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కడపలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉమ్మడి కడప జిల్లా ఈడిగ సంఘం అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో కడప, కర్నూలు ఈడిగ సంఘం నాయకులు కలిసి బాధితునికి రూ.1.40 లక్ష నగదును వైద్య చికిత్స కోసం అందజేశారు. బాధితునికి ఆదుకొనేందుకు సహకరించిన కెవి కుమార్, సిద్ధార్థ గౌడ్‌కు జిల్లా అధ్యక్షుడు రవిశంకర్‌గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన వారందరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఈడిగ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, నరసింహ, శ్రీధర్ కుమార్, గంగాధర్ గౌడ్, రామ్మూర్తి నాయుడు, మునిరత్నం, వెంకటసుబ్బయ్య, శివ రామక్రిష్ణ, పాల్గొన్నారు.


ఎమ్మెల్యే 'పుట్టా'ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ వీరనారాయణ యాదవ్

## ఎమ్మెల్యే సహకారంతో ఆలయ అభివృద్ధి

**ప్రజాశక్తి - చాపాడు**

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఆ ఆలయ చైర్మన్‌గా నియమించబడిన పెరుగు వీరనారాయణ యాదవ్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఆయన పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వీరనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఆలయ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అల్లాడుపల్లె దేవళాలులో ఘనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో మాజీ జెడ్పిటిసి మేకల బాబు, టిడిపి యువ నాయకులు గుత్తి నారాయణ యాదవ్, కొండపల్లి శేషగిరి, సుధాకర్‌రెడ్డి, జయరాం, సురేష్ పాల్గొన్నారు.

## తెలుగు వారికి ప్రాధాన్యతనివ్వాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

టిటిడిలో చేపట్టే ఉద్యోగాల్లో తెలుగు ప్రాంత బ్రాహ్మణులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలివ్వాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరి ప్రసాదరావు, సూగురు రఘునాథరావు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పారాయణలో 700 ఉద్యోగాలు భర్తీకి టిటిడి చర్యలు చేపట్టడంతో బ్రాహ్మణుల్లో కొద్దిగా ఆశలు ఉన్నాయన్నారు. భర్తీ చేసే ఉద్యోగాలకు సంబంధించి డిప్యూటీ ఈవో, కార్యాలయ ఓఎస్‌డి గోవిందరాజన్ గోల్‌మాల్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వివిధ మాధ్యమాలలో వార్తలు రావడంతో బ్రాహ్మణుల్లో ఆందోళన మొదలైందన్నారు. చైర్మన్ ప్రకటనలకు విరుద్ధంగా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిసిందన్నారు. వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గోవిందరాజన్, పనియగ్నేశ్వర్‌యాజులను తొలగించి నిజాయితీ అధికారులను నియమించి, ఉద్యోగ నియమాక ప్రక్రియ ప్రారంభించాలని వారు కోరారు. ఉద్యోగ నియామకాల్లో తెలుగు బ్రాహ్మణులుకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## ట్రిపుల్‌ఐటికి బస్సు సౌకర్యం

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించినట్లు టిడిపి నేతలు మహమ్మద్ ఇనాయతుల్లా, వీరబద్ర, జబిబుల్లా తెలిపారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో బుధవారం టిడిపి నేతలు మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక చాలా అవస్థలు పడేవారని తెలిపారు. ఆ అవస్థలను పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి సంబంధిత మంత్రితో చర్చించి బస్సు సౌకర్యం కల్పించారని వివరించారు. ఈ నెల 11న గురువారం నుంచి వేంపల్లె మీదుగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్ వరకు ఆర్టీసీ బస్సు వెళుతుందన్నారు. బస్సు సౌకర్యం కల్పించినందుకు ఉద్యోగులు, విద్యార్థుల తరపున టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టిడిపి నేతలు బాలకృష్ణారెడ్డి, ఫయాజ్, ఆంజి, మస్తాన్ పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న పార్థసారథిరెడ్డి

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**ప్రజాశక్తి - వేముల**

మండలంలోని పలువురు లబ్ధిదారులకు వేములలో బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి, ఆయన సోదరుడు పేర్ల శేషారెడ్డి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో సిఎం చంద్రబాబు, పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. సిఎంఆర్ఎఫ్ నిధులతో చాలా కుటుంబాలు ఆర్థికంగా ఉపశమనం పొందుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి మరింత నిధులు రప్పించి అభివృద్ధి చేయడం తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వేల్పుల సొసైటీ అధ్యక్షుడు రాగిపిండి సుధాకర్‌రెడ్డి, చాగలేరు మహేష్, దుగ్గన్నగారిపల్లె వసంతరెడ్డి, అమ్మయ్యగారిపల్లె పద్మనాభరెడ్డి, కొత్తపల్లి శశిధర్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదివాసుల కోసం పోరాడిన స్టాన్‌స్వామి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

సమస్యల పట్ల ప్రతిస్పందన పోరాటమే అని చాటి చెప్పిన వ్యక్తి స్టాన్ స్వామి అని జన విజ్ఞాన వేదిక జిల్లా యూత్ కన్వీనర్ హేమంత్ కుమార్ అన్నారు. మానవ హక్కుల కార్యకర్త ఆదివాసుల కోసం జీవితాంతం పరితపించిన ఫాదర్ స్టాన్ స్వామి జైల్లో రాసిన మౌన ప్రేక్షకుడిని కాను పుస్తకాన్ని మిత్ర జ్యోతి సాహితీ, సాంస్కృతిక సంస్థ, విప్లవ రచయితల సంఘం, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా పుస్తక పరిచయ సభను బుధవారం సాయంత్రం స్థానిక జెవివి కార్యాలయంలో కవి మహమూద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల వ్యక్తి ప్రయోజనాల కంటే సంఘ ప్రయోజనాలే ముఖ్యమని గ్రహించిన స్టాన్‌స్వామి ఆదివాసుల కోసం పరితపించారని, వారి హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేశారన్నారు. భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్లో ఉన్న ఆదివాసుల హక్కుల కోసం పనిచేశారని గుర్తు చేశారు. భూమి కోసం చేసే పోరాటాల వెనుక స్టాన్ స్వామి ఉన్నారన్నారు. ఇలాంటి పోరాటాలు జరగకుండా ప్రభుత్వం అనేకమంది ఆదివాసులను జైలులో ఉంచారన్నారు. వీరి కోసం పోరాడిన స్టాన్‌స్వామిని బీమా గోరేగాం కేసులో అన్యాయంగా ఇరికించారన్నారు. ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులందరూ గొంతు ఎత్తారన్నారు. జైలులో కూడా ఆయనకు కనీస వసతులు కల్పించకుండా ఆయన మృతికి కారణమయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, జెవివి రాష్ట్ర నాయకులు తవ్వా సురేష్, రచయితలు కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, జింక సుబ్రహ్మణ్యం, చైతన్య మహిళా సంఘం పద్మ, గోపీనాథ్‌రెడ్డి, సిపిఐ సుబ్బరాయుడు, ఇన్నర్ వీల్ భారతి, దేవానంద్, కొత్తపల్లి శీను, పౌర హక్కుల సంఘం సురేష్, ప్రొఫెసర్ షఫీ ఉల్లా, షబ్బీర్, హైమ, రాకేష్, బాలా నరసింహులు, సరస్వతమ్మ, ఆర్యవైటి చంద్రశేఖర్, ప్రజా నాట్యమండలి పల్లవోలు రమణ, జాన్, జయసింహ పాల్గొన్నారు.

## 14న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న ఆదివారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్ బాషా తెలిపారు. ఉదయం 9 గంటలకు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆటస్థలంలో అండర్-14 విభాగంలో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. వీరికి ట్రియాథ్లోన్ 60మీ, లాంగ్ జంప్, హై జంఎ, ట్రియాథ్లోన్ 60 మీ, లాంగ్ జంప్, బ్యాక్ త్రో, ట్రియాథ్లాన్ 60మీ, లాంగ్ జంప్, 600 మీ, కిడ్స్ జావెలిన్, అండర్-16 విభాగంలో బాలబాలికలకు 60మీ, 600మీ, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్ పుట్‌త్రో క్రీడలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. కడప జిల్లా వారు ఎవరైనా పాల్గొనవచ్చు అన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 27,28,29 తేదీల్లో ఏలూరులో నిర్వహించే స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌నకు ఎంపిక కాబడుతారని వివరించారు. 12ఏళ్లు నిండిన వారు మాత్రమే పాల్గొనాలన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు.